వారంరోజుల్లో రాధ చిక్కి శల్యమయి మంచం పట్టింది. రాధ గొంతు వెలుగురాచుకుపోయింది. హీనస్వరం పడ్డది. రాధ మంచినీళ్లుకూడా ముట్టటం మానేసింది.

మరో నాలుగయిదురోజులకు రాధ అంతరించింది.

రాధను తల్లి దయ్యమైపట్టి తీసుకుపోయిందని అంతా అనుకున్నారు.

---

## భూతదయ

(అల్పిక)

రాజుగారి కొలువులో నిండుసభలో అహింసను గురించిన చర్చ వచ్చింది.

ఇద్దరు ప్రజ్ఞావంతులు చెరోపక్షాన తగులుకునేప్పటికి మిగిలిన వారంతా విరమించి వినోదం చూడసాగారు.

బక్కవాడైనా అహింసకూడదని ఘట్టిగా వాదిస్తున్నాడు ఒకడు; బలవంతుడే కాని అహింస పరమధర్మమని వాదించి నెగ్గలేకుండా ఉన్నాడు, రెండోవాడు.

సభ బక్కవాడి పక్షం అయిపోతున్నది క్రమంగా.

బలవంతుడి మొహం జేగురించింది. ఆగ్రహం పట్టలేక పోయినాడు. బలహీనుడిమీదికి లంఘించాడు. మెడ రెండు చేతులా పట్టుకొని తోటకూర కాడను ఊపినట్టు ఊపాడు.

బక్కవాడు గుడ్లు తేలవేశాడు. అహింస గెలిచింది.

---